ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 53 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 6 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## కామారెడ్డి జిల్లా మంజీరా నదిలో
# ఘోర ప్రమాదం

**స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి**


**మృతులు అనిత (40), పావని (14), శివాని (13)గా గుర్తింపు**

**ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా కాపాడిన స్థానికులు**

**ఎల్లమ్మ గుడికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లగా ఘటన**

**కామారెడ్డి, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బాన్సువాడ మండల పరిధిలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు ..మిగతా 2లో



## మీ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు

2లో..

**రేవంత్ రెడ్డిపై ధర్మపురి అర్వింద్ ఫైర్**

# పదేళ్ల పాలనపై కేసీఆర్ చర్చకు రావాలి

**బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన.. నా 30 నెలల పాలనపై చర్చకు సిద్ధమా?**

**కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్**

**కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**పాలమూరు గడ్డపై భవిష్యత్‌లో ఒక్కరిని కూడా గెలవనివ్వమని శపథం**

**జడ్చర్ల, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఎగురనివ్వమని సీఎం రేవంత్ రెడ్డి శపథం చేశారు. గద్దెలు దిగాలి, దిమ్మెలు కూలాలి అని అన్నారు. పాలమూరు గడ్డపై భవిష్యత్‌లో ఒక్కరిని కూడా గెలవనివ్వమని అన్నారు. 30 నెలల కాంగ్రెస్ పాలన చెబితే రామాయణం, రాస్తే భారతం అవుతందన్నారు. కేసీఆర్ పదేళ్లపాలన, తన 30 నెలల పాలనపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. పాలనపై చర్చలో తాను ఓడితే క్షమామణ చెబుతానని రేవంత్ రెడ్డి అన్నారు. జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ వద్ద బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**చర్చలకు రమ్మంటే పారిపోతున్నారు :**

గోదావరి జలాల్లో జరిగిన అన్యాయంపై మహారాష్ట్ర సీఎంను అడుగుతామని, అవసరమైతే కడుగుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎలాగైనా తుమ్మడిహట్టి వద్ద గోదావరిపై ప్రాణహిత- చేవెళ్ల కడతామన్నారు. గోదావరి జలాలపై మహారాష్ట్ర సీఎం దాగుడుమూతలు అడుతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. చర్చలకు రమ్మంటే కూడా రాకుండా పారిపోతున్నారని ఆక్షేపించారు. రైతుల కష్టాలు తీర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామన్న ఆయన కృష్ణా జలాల వివాదం 60 ఏళ్లుగా రావణకాష్ఠంలా రగులుతోందన్నారు. పక్కరాష్ట్రంతో చర్చలు జరిపి



డిసెంబర్ లోగా పాలమూరు జలాలపై అనుమతులు సాధిస్తామన్నారు. ఏపీపై ఒత్తిడి తెచ్చి లేదా కొట్లాడి ఎన్ వోసీ తీసుకొస్తామన్నారు.

**ఆ ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తిచేస్తాం :**

పాలమూరు రంగారెడ్డికి 90 టీఎంసీల నీళ్లకు అనుమతులు సాధిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టుకు 20 టీఎంసీల నీళ్లకు అనుమతులు సాధించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఉద్దండాపూర్ వరకు ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని వివరించారు. రెండున్నరేళ్లలో జూరాల వద్ద కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తామని చెప్పారు. కర్ణాటక, మక్తల్ సరిహద్దుల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజ్‌ను కడుతామన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులను ఇస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని వివరించారు. పాలమూరు జిల్లాను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కారు అని ప్రజలతో కలిసి సీఎం ..మిగతా 2లో

# అన్నామలై రాజీనామాకు ఆమోదం



**కొత్త పార్టీ స్థాపన దిశగా అడుగులు**

**తమిళనాడు, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా నడుస్తున్న ఉత్కంఠకు తెరపడింది. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే అన్నామలై ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆయన సమర్పించిన రాజీనామాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ శుక్రవారం ఆమోదించారు. మాజీ ఐపీఎస్ అధికారి అయిన కుప్పుసామి అన్నామలై పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆ తర్వాత తమిళనాడులో పార్టీని బలోపేతం చేయడానికి ఆయన తీవ్రంగా శ్రమించారు. అయితే, గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ మారుతారనే ప్రచారం జోరుగా సాగింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన నెల రోజులకు అన్నామలై ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ఎన్నికల్లో సినీ నటుడు సీ జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. కాగా, బీజేపీ మాత్రం ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకుంది. గతంలో నాలుగు స్థానాలు ఉన్న బీజేపీ, ఈసారి కేవలం ఒక్క సీటుకే పరిమితమైంది. ఓట్ల శాతం మాత్రం గతంలోని 2.67 శాతం నుండి స్వల్పంగా 2.97 శాతానికి పెరిగింది.

**కొత్త పార్టీ పెట్టబోతున్నారా?**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితాలో అన్నామలై పేరు లేకపోవడంతోనే ..మిగతా 2లో




# జీడీపీ వృద్ధి 7.7 శాతం

**కేంద్ర ప్రభుత్వం వెల్లడి**

**న్యూఢిల్లీ, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ దేశ ఆర్థికవ్యవస్థ మునుపటి కంటే వేగం పుంజుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.1 శాతం నమోదు కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరింత మెరుగై 7.7 శాతానికి పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గణాంకాలు విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం జనవరి-మార్చి కాలంలో జీడీపీ వృద్ధిరేటు 7.8శాతంగా నమోదైనట్టు తెలిపింది. స్థిర ధరల వద్ద 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను భారత రియల్ జీడీపీ 323.12లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. ఇది 2024-25 నాటి సవరించిన అంచనా 299.89 లక్షల కోట్ల కంటే ఎక్కువని పేర్కొంది. ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద దేశ జీడీపీ విలువ 346.36 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనాలున్నాయి.

# త్వరలో పాలిమర్ నోట్లు..!

**పేపర్ కరెన్సీకి స్వస్తి**

**ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆర్బీఐ**

**ప్రాథమిక దశలోనే నిర్ణయం**

**అభిప్రాయ సేకరణ తర్వాత అమలులోకి**

**రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

**న్యూఢిల్లీ, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

ప్రస్తుతం పేపర్ కరెన్సీ నోట్లు ఉండగా.. వీటి వినియోగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేపర్ నోట్లు త్వరగా పాడైపోవడంతో పాటు చిరిగిపోయే అవకాశముంటుంది. దీంతో పాటు వీటి తయారీకి ఎక్కువ ఖర్చవుతుంది. దీంతో వీటి స్థానంలో ప్లాస్టిక్ లేదా పాలిమర్‌తో తయారుచేసిన కరెన్సీ నోట్లను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో ప్రవేశపెట్టనుందనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఆర్బీఐ ప్రతిపాదనలు ..మిగతా 2లో



# మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు అరెస్టు

**గండిపేట భూకబ్జా కేసులో పోలీసుల అదుపులోకి**


**నకిలీ జీఓలు, తప్పుడు రెవిన్యూ రికార్డులు సృష్టి**

**(హైదరాబాద్ జూన్ 5 (ప్రభాత ఉదయం)**

నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మానాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ



రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు ..మిగతా 2లో



# షర్మిలకు మొండి చేయి

**పక్కన పెట్టిన కాంగ్రెస్ అధిష్టానం**

**రాజ్యసభకు హామీ ఇచ్చిన దక్కని ఛాన్స్**

**పార్టీ బలోపేతంపైనే ఇక దృష్టి**

2

# పదేళ్ల పాలనపై కేసీఆర్ చర్చకు రావాలి

**మొదటి పేజీ తరువాయి...**

నినాదించారు.

"కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట. వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట. 20 ఏళ్ల క్రితం మీ జిల్లాలో నాటిన మొక్క తెలంగాణ సీఎంగా వృక్షమై నిలబడ్డాడు. నాటి మాదిరిగానే పాలమూరులో ఇప్పుడూ 10 లక్షల ఎకరాలకే నీళ్లు అందుతున్నాయి. గతంలో పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను పట్టించుకోలేదు. రూ.22 వేల కోట్లలో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టులకు ఖర్చు చేశాం. 200 ఎకరాల్లో ఎడ్యుకేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసుకుంటున్నాం. రెండు పడక గదుల ఇళ్లు కట్టినచోటే మీరు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే నేను ఓట్లు అడుగుతా. మీకు డిపాజిట్ వస్తే నా పేరు మార్చుకుంటా"-రేవంత్ రెడ్డి



మీరు చేసిన పాపాలు ప్రజలు మరువరు : కరీంనగర్‌లో ఓడిపోతానేమోనని ఒక నేత పాలమూరుకు వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నామని, పాలమూరు నుంచి పార్లమెంటు సభ్యుడిగా కేసీఆర్‌ను గెలిపించుకున్నామని గుర్తు చేశారు. ఐదేళ్లు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నా ఐదుసార్లు కూడా పాలమూరుకు రాలేదని ఆరోపించారు. మేకవన్నిన పులి అని తెలియక కేసీఆర్‌ను ప్రజలు రెండుసార్లు గెలిపించారని, బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు, పొర్లుదండాలు పెట్టినా పాపాలు తీరవన్నారు. మీరు చేసిన పాపాలను ఎన్నటికీ ప్రజలు మరువరని రేవంత్ రెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారంపై రైతులకు ఎప్పుడైనా భరోసా ఇచ్చారా అని ప్రశ్నించారు.

---

# మీ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు

## రేవంత్ రెడ్డిపై ధర్మపురి అర్వింద్ ఫైర్

**హైదరాబాద్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటుగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి అంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామన్న సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అర్వింద్ మండిపడ్డారు. వరి కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సింది పోయి, తన వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. "దొంగ ఇసుక, మొరం రవాణాకు లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంటాయి కానీ.. రైతుల ధాన్యం తరలించడానికి మాత్రం లారీలు దొరకవా?" అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను గాలికొదిలేసి, కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎండగట్టారు. సీఎం ఇప్పటివరకు తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని, కేవలం విమర్శలకే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు.



# కామారెడ్డి జిల్లా మంజీరా నదిలో ఘోర ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

బాన్సువాడ మండలం బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. దర్శనం అనంతరం దగ్గరలోని మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు. వారి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. కానీ, అప్పటికే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీట మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒకే కుటుంబంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

---




# ఐకార్-క్రీడా " ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## "ఏక్ పెడ్ మా కే నామ్"

**హైదరాబాద్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

ఐకార్-క్రీడా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కార్యక్రమంలో భాగంగా "ఏక్ పెడ్ మా కే నామ్" జరుపుకున్నారు. సీఆర్ఐడీఏ ప్రధాన క్యాంపస్లో మిషన్ లైఫ్ కింద " ఏక్ పెడ్ మా కే నామ్ " మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంచడం, అలాగే సిబ్బంది సమాజంలో సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించడం అనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది.పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా, ఐసీఏఆర్-సీఆర్డీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె. సింగ్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణలో వ్యక్తిగత బాధ్యత యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ వి.కె. సింగ్ నొక్కిచెప్పారు. ప్రతి పౌరుడు తమ తల్లి గౌరవార్థం ఒక చెట్టును నాటి, పెంచేలా ప్రోత్సహించే "ఏక్ పెడ్ మా కే నామ్" ప్రచారం ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.దైనందిన జీవితంలో పర్యావరణ స్పృహతో కూడిన ప్రవర్తనను మరియు సుస్థిర పద్ధతులను ప్రోత్సహించే మిషన్ లైఫ్ యొక్క లక్ష్యాలను కూడా బలపరిచింది .నిరంతర మొక్కల పెంపకం మరియు పరిరక్షణ కార్యక్రమాల ద్వారా పచ్చదనాన్ని, పర్యావరణ అవగాహనను ప్రోత్సహించాలనే సామూహిక సంకల్పంతో ఈ కార్యక్రమం ముగిసింది.



# మంచినీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## జలమండలి నిధులతో కిస్మత్‌పూర్ లో రూ.48లక్షలతో నీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**కిస్మత్‌పూర్,జూన్05(ప్రభాత ఉదయం)**

ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.కిస్మత్‌పూర్ సెక్షన్ పరిధిలోని శివాలయ టెంపుల్ నుండి హిమగిరినగర్ రోడ్ నెంబర్ 7 వరకు త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న నూతన పైప్‌లైన్ పనులకు ఆయన హాజరై శంకుస్థాపన వేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇకనుండి ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య తీరనుందని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు నిరంతరం నాణ్యమైన నీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో జలమండలి జిఎం లక్ష్మి,డీజీఎం జవహర్ అలీ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఉప్పర్‌పల్లిలో మొక్కలు నాటిన బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

# కాలుష్య రహిత దేశమే ప్రధాని నరేంద్ర మోడీ ఆశయం

## ప్రకృతిని దైవంగా పూజించే సంస్కృతి మనది: బిజెపి నాయకులు బొక్క బాల్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

కాలుష్య రహిత దేశమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వెళ్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు.ప్రకృతిని కేవలం వనరుగా కాకుండా, సాక్షాత్తూ దైవస్వరూపంగా, జగన్మాతగా పూజించే మహోన్నతమైన హిందూ సనాతన ధర్మ సంస్కృతి మన భారతదేశానిది అని బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఉప్పర్పల్లిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయ ఆవరణలో బిజెపి ముఖ్య నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు.ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ... హిందుత్వ జీవన విధానంలో చెట్టు, పుట్ట, నది, పర్వతం ప్రతి ఒక్కదానికీ దైవత్వాన్ని ఇచ్చి కాపాడుకునే సాంప్రదాయం ఉందన్నారు. 'వృక్షో రక్షతి రక్షితః' --- అంటే మనం వృక్షాలను రక్షిస్తే, ఆ వృక్షాలు మనల్ని రక్షిస్తాయనే వేదోక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో మన గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు ఉప్పర్పల్లి పార్టీ ఆఫీసు ఆవరణలో తాము నాటిన అనేక మొక్కలు నేడు మహా వృక్షాలుగా అవతరించాయని బొక్క బాల్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాడు నాటిన ఆ చెట్లు నేడు ఎంతోమందికి పండ్లను, పూలను అందిస్తూ, పరిసర ప్రాంతాలకు స్వచ్ఛమైన గాలిని ఇస్తూ పర్యావరణాన్ని కాపాడుతుండటం మనకళ్ల ముందే కనిపిస్తోందని, అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కేవలం ఫోటోల కోసం మొక్కలు నాటడం కాకుండా, నాటిన ప్రతి మొక్కను వృక్షంగా మార్చే వరకు బాధ్యతగా కాపాడటమే నిజమైన దేశభక్తి మరియు హిందూ ధర్మ రక్షణ అని ఆయన నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు: ఈ పర్యావరణ రక్షణ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొక్క బాల్ రెడ్డి తో పాటు విట్టల్, శ్రీకాంత్ రెడ్డి, పవన్ కుమార్, ప్రవీణ్, మరియు భోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. పచ్చని పరిసరాలే లక్ష్యంగా ఉప్పర్పల్లి డివిజన్ వ్యాప్తంగా పర్యావరణ చైతన్యాన్ని తీసుకువస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# భార్యపై అనుమానంతో కత్తితో దాడి.. చికిత్స పొందుతూ మృతి..

**రాజేంద్రనగర్,జూన్05(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తేజస్వినగర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది.నాందేడ్ ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు కోమల్(33), అవినాష్‌ల మధ్య శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం.భార్యపై అనుమానం పెంచుకున్న అవినాష్,కోపోద్రిక్తుడై కత్తితో కోమల్‌పై విచక్షణారహితంగా దాడి చేసాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలపాలైన కోమల్‌ను ఆస్పత్రికి తరలించారు.అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.ఘటన స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు.వీరికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

---

# అన్నామలై రాజీనామాకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన అసంతృప్తితో ఉన్నారనే వార్తలు వచ్చాయి. ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ఆయన ఢిల్లీ వెళ్లి అధిష్టాన పెద్దలను కలవడంతో ఈ ఊహాగానాలకు మరింత బల చేకూరింది. అన్నామలై త్వరలోనే సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. "దయచేసి కొద్దిరోజులు వేచి ఉండండి. మరో రెండు రోజుల్లో మనం కూర్చుని అన్ని విషయాలు మాట్లాడుకుందాం" అని ఈ వారంలో కొత్త పార్టీ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు అన్నామలై సమాధానమిచ్చారు. దీనిని బట్టి చూస్తే ఆయన త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# షర్మిలకు మొండి చేయి

**న్యూఢిల్లీ, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

నా సంగతేంటి.. నాకు ఇచ్చిన హామీ గుర్తుంది కదా.. నాకు రాజ్యసభ ఇవ్వాలి' ఇది వారం రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అధిష్టానానికి గుర్తు చేసిన మాటలు. కానీ ఇప్పుడు సర్లే ఎన్నెన్నో అనుకుంటాం. అన్ని అవుతాయా ఏంటి..! ఇది ఇప్పుడు షర్మిల పరిస్థితి. రాజ్యసభ విషయంలో వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ అధిష్టానం మొండి చేయి చూపింది. వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్ లో విలీనం సందర్భంగా తనకు ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ను షర్మిల కలిసి చేసిన విజ్ఞప్తి ఫలించలేదు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పడం కష్టం. కాంగ్రెస్ పార్టీలో అది ఇంకా కష్టం. దానికి ఇదే నిదర్శనం. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తో మంచి సంబంధాలు ఉన్నా వైఎస్ఆర్ కూతురు, పార్టీ విలీన హామీ ఇవేవీ షర్మిలకు రాజ్యసభ స్థానం ఇప్పించలేక పోయాయి. రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిననాటి నుంచి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అద్యక్షురాలు వైఎస్ షర్మిల కర్ణాటక రాజ్యసభ రేసులో ఉన్నారు. దక్షిణాదిలో తెలంగాణ, కర్ణాటకలో సొంతంగా అధికారంలో ఉండగా కేరళ, తమిళనాడులో భాగస్వామ్య పక్షాలతో అధికారంలో ఉంది. ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడాలన్నా, ఏపీ గొంతుక పార్లమెంట్ లో వినిపించాలంటే రాజ్యసభ ఒక మంచి అవకాశంగా షర్మిల భావించారు. తనకు రాజ్యసభ స్థానంతో ఏపీలో పార్టీ బలోపేతం అవుతుందన్న విషయాన్ని సైతం అధిష్టానానికి తెలిపారు. ఖచ్చితంగా తనకు రాజ్యసభ వస్తుందన్న ధీమాలో నిన్నటి వరకు షర్మిల ఉన్నారు. ఆపై మల్లిఖార్జున ఖర్గే సైతం హైదరాబాద్ వేదికగా మీడియాతో మాట్లాడుతూ షర్మిలకు రాజ్యసభ హామీ ఉందన్న విషయంపై క్లారిటీ ఇచ్చారు. కానీ తాజాగా అధిష్టానం ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో షర్మిల పేరు లేకపోవడం ఆమెకు షాక్‌కు గురి చేసింది. వైఎస్ఆర్ కుమార్తె, తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసినా రాజ్యసభ ఇస్తామని హామీ ఇచ్చినా షర్మిలకు రాజ్యసభ ఇవ్వకపోవడం వెనుక అనేక కారణాలు ఉన్నాయంటున్నారు పార్టీ వర్గాలు. ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఉనికి లేకపోవడం, జాతీయ స్థాయిలో పార్టీకి ఉన్న అవసరాల నేపథ్యంలో హై కమాండ్ షర్మిలను రాజ్యసభ నిరాకరించింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో షర్మిల అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ పుంజుకోలేకపోవడం, సీనియర్ నాయకుతో విభేదాలు, కూటమి ప్రభుత్వ వ్యతిరేకత కార్యక్రమాలు చేపట్టకపోవటం, కేవలం జగన్ మీద ఆరోపణలకే పరిమితం అవడం తప్ప పార్టీకి ప్రయోజన కార్యక్రమాలు చేపట్టలేదని షర్మిలపై అధిష్టానం వద్దకు అనేక ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా కర్టాటక కాంగ్రెస్ స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత కారణంగా చివరి నిమిషంతో ఏఐసీసీ మీడియా ఇంచార్జ్ పవన్ ఖేరా, మల్లిఖార్జున ఖర్గే, మన్సూర్ కు రాజ్యసభ స్థానాలు దక్కాయి. ప్రస్తుతం షర్మిల బెంగుళూరులో ఉన్నారు.కాంగ్రెస్ లోకి షర్మిలను తీసుకొచ్చిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారానికి హాజరైన షర్మిల రెండు రోజులుగా అక్కడే ఉన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ రాజ్యసభ కేటాయించకపోవటంతో ఎందుకు అవకాశం ఇవ్వలేదు అనేది అధిష్టానాన్ని అడగడం కన్నా ఏపీలో పార్టీ బలోపేతం పై దృష్టిసారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

# మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అరెస్టు

**మొదటి పేజీ తరువాయి...**

చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

# త్వరలో పాలిమర్ నోట్లు..!

**మొదటి పేజీ తరువాయి...**

సిద్దం చేసిందని, వివిధ వర్గాల అభిప్రాయం అనంతరం త్వరలో అందుబాటులోకి తీసుకురానుందనే వార్తలు గత కొద్దిరోజులుగా వినిపిస్తున్నాయి. ఈ వార్తలపై ఎట్టకేలకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. ప్లాస్టిక్ లేదా పాలిమర్ నోట్లను తీసుకొచ్చే అంశం ప్రతిపాదనల దశలో ఉందని, ప్రస్తుతం ఈ నిర్ణయం ప్రాథమిక దశలో ఉందని తెలిపారు. శుక్రవారం ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమావేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశారు. రెపో రేటును 5.25 శాతం వద్ద స్థిరంగా ఉంచుతున్నట్లు తెలిపారు. గత ఏడాది రెపో రేటును 125 బేసిస్ పాయింట్లు తగ్గించగా.. ఈ ఏడాదిలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీని వల్ల రుణ, ఈఎంఐ వడ్డీ రేట్లు యథాతథంగా ఉండనున్నాయి.

**ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల వల్ల ఉపయోగం**

ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లు త్వరగా మురికి పడతాయి. అలాగే వెంటనే చిరిగిపోతాయి. దీంతో పాటు నకిలీ నోట్ల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. వీటికి చెక్ పెట్టేందుకు ఆర్బీఐ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసింద. కానీ అది కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఆ నిర్ణయంపై సమాలోచనలు చేస్తోంది. ప్లాస్టిక్ నోట్లు గట్టిగా ఉండటం త్వరగా చిరిగిపోవు. అలాగే మురికిగా మారే అవకాశాలు తక్కువా ఉంటాయి. ఇవి ఎక్కువకాలం అలాగే ఉంటాయి. డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కూడా కరెన్సీ నోట్లకు డిమాండ్ ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు కరెన్సీని ఎక్కువగా వాడుతున్నారు. ఇక నగరాల్లో కూడా జేబుల్లో క కరెన్సీ నోట్లను ఉంచుకునేవారు కూడా ఉన్నారు. దీంతో డిటిటల్ లావాదేవీల కాలంలో కూడా నోట్లను ఉపయోగించేవారు కూడా చాలామంది ఉన్నారు. దీంతో పాలిప్రొపైలిన్ అనే ప్రత్యేక ప్లాస్టిక్ పాలిమర్‌తో తయారుచేసిన నోట్లను తీసుకురావాలని ఆర్బీఐ చూస్తోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను మనం చూడవచ్చు. పేపర్ నోట్లను తొలగించి వీటిని తెచ్చే అవకాశముంటుంది.

# ఘనంగా సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డి గూడెం భీమయ్య జన్మదిన వేడుకలు



సీనియర్ రిపోర్టర్ అప్పారెడ్డి గూడెం భీమయ్య చేత కేక్ కట్ చేయించి తినిపిస్తున్న ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి



సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డి గూడెం భీమయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సహచర ఆత్మీయ పాత్రికేయ మిత్రులు

**రాజేంద్రనగర్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీ యూ డబ్ల్యూ జె) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు , ఆంధ్ర జ్యోతి చార్మినార్ జోన్ ఇంచార్జ్ అప్పారెడ్డిగూడెం భీమయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సహచర ఆత్మీయ పాత్రికేయ మిత్రులు, ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి , సూర్య రేఖ తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మెక్కొండ ప్రేమ్ రాజ్ , సాక్షి దినపత్రిక రాజేంద్రనగర్ జోనల్ ఇంచార్జ్ బుడిగెల బాబురావు , దిశ రిపోర్టర్ వర్కాల చందు, సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి, విశాలాంధ్ర దినపత్రిక రిపోర్టర్ కోరని మహేష్ లు భీమయ్య చేత కేక్ కట్ చేయించి శాలువ, పూలమాలతో సన్మానించారు. అప్పారెడ్డిగూడెం భీమయ్య మృదు స్వభావి అని, అందరిని కలుపుకుపోయే వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో సుదీర్ఘ కాలం పాటు పాత్రికేయ వృత్తిలో ఉంటూ అందరి మన్ననలను చురగొన్న వ్యక్తి భీమయ్య అని కొనియాడారు. అప్పారెడ్డిగూడెం భీమయ్య కలకాలం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఇష్ట ఐశ్వర్యాలతో జీవించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 12మంది అరెస్ట్


**రాజేంద్రనగర్,జూన్05(ప్రభాత ఉదయం)**

పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న 12మంది అరెస్టు చేశారు.ఈ ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ డైమండ్ సిటీ కాలనీలోని పేకాట స్థావరంపై అత్తాపూర్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 12మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జూదరుల నుంచి రూ.43 వేల నగదు,నాలుగు ద్విచక్ర వాహనాలు,మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వారిపై జూద నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువత పేకాట, డ్రగ్స్ వంటి దురాగాతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## భార్య పై అనుమానంతో భర్త కత్తితో దాడి

**చికిత్స పొందుతూ మృతి**

**రాజేంద్రనగర్, జూన్ 5 (ప్రభాత ఉదయం) :**



అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తేజస్వి నగర్ లో అనుమానంతో భార్యను భర్త కత్తి తో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది.సీఐ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు కోమలి (33), అవినాష్ లకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. బతుకుతెరువు కోసం వలస వచ్చి తేజస్వి నగర్ కాలనీ లోని అపార్ట్మెంట్లో వాచ్మెన్ రూమ్ లో నివాసం ఉంటున్నారు. భర్త అవినాష్ ఆటో డ్రైవర్ గా, భార్య కోమలి అపార్ట్మెంట్లోని ఇళ్లలో పనిచేస్తుంది. వీరికి 8, 9 సంవత్సరాల ఇద్దరు బాబులు ఉన్నారు. కోమలి ఇళ్లలో పనిచేస్తూ రాత్రి ఇంటికి లేటుగా వస్తుందని భర్త పలుమార్లు గొడవపడ్డాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.భార్యపై అనుమానం పెంచుకున్న అవినాష్, కోపోద్రిక్తుడై కత్తి, రాడ్ తో కోమలి పై విచక్షణారహితంగా దాడి చేసాడు.రక్తపు మడుగులో పడివున్న కోమలి ను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ.. తీవ్ర రక్తస్రావం కావడం వల్ల ఆమె ప్రాణాలు విడిచింది.ఘటన స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు. కోమలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పరారీలో ఉన్న కోమలి భర్త అవినాష్ ను పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



కిస్మత్ పూర్ లోని సత్యసాయి ఎన్నారై టౌన్షిప్ లో మొక్కలు నాటిన స్వర్ణలతారెడ్డి

## పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నపురెడ్డి స్వర్ణలతారెడ్డి**

**మొక్కలు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి**

**బండ్లగూడ, జూన్ 5(ప్రభాత ఉదయం)**

పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నపురెడ్డి స్వర్ణలతారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కిస్మత్ పూర్ లోనిసత్యసాయి ఎన్నారై టౌన్షిప్ లో కాలనీవాసులతో కలిసి ఆమె మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రోజురోజుకు నగరాల్లో పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణ కోసం ఇంటి ఆవరణలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.



## కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి

**బిజెపి డివిజన్ అధ్యక్షులు సందీప్**

**రాజేంద్రనగర్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

నగరాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించటానికి సమాజంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి, పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో ప్రజాభవన్, శివరాంపల్లి వద్ద "ఏక్ పెడ్ మా కే నామ్" వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. అలాగే స్వచ్ఛ భారత్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ పరిశుభ్రత, హరితాభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, బండారి బాలకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, విజయ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



## ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడండి:

**జిల్లా జడ్జి అపర్ణదేవి**

**రాజేంద్రనగర్,జూన్05(ప్రభాత ఉదయం)**

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని జిల్లా జడ్జి అపర్ణదేవి సూచించారు.రాజేంద్రనగర్ కోర్టు భవనాల సముదాయంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మొక్కలు వివిధ రకాల మోక్కలు నాటారు.ప్రజలందరూ తల ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్జిలు శ్రీనివాస్,సుచరిత,నర్మద,నరేష్,ఉదయ్ నాయక్,రత్నకుమారి,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి,కార్యదర్శి నరసకార్యదర్శి అనితా రాణి,కోర్టు సిబ్బంది వెంకట రంగారెడ్డి,ఆషమ్ అలి,సునీత,నరేష్ గౌడ్,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్ పల్లి, జూన్ 5 (ప్రభాత ఉదయం)**




సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన కార్యక్రమాలు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ శ్రీ హేమ దుర్గాభవన్ లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని లక్ష్మయ్య చేత కేక్ కటింగ్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు సముచిత గౌరవం ఉంటుందని, వారికి మంచి పదవుల లభించే లాగా తన వంతు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు నాయకులకు మంచి పదవులు లభిస్తాయి అని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాయిబాబా చౌదరి, ధర్మ రావు, మస్తాన్ రెడ్డి, కనకయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, మేకల మహేష్, నసీర్, మోహన్ నాయక్, బండి సుధా, సంధ్య, కల్పన, అపర్ణ , జయలక్ష్మి, రాజేశ్వరి, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, దానలక్ష్మి,రజని, నాగమణి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## నేడు మైలార్‌దేవ్‌పల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**



మైలార్ దేవుపల్లి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోవేసవి ప్రణాళిక పనుల నిమిత్తం ఫీడర్‌పై కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మైలర్ దేవ్ పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుండి 11 గంటల వరకు అయేషా కాలనీ, హషమాబాద్, టవర్ గల్లీ, దస్తగిరి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# రాజేంద్రనగర్ ప్రేయర్ వారియర్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

**మొయినాబాద్ సురంగల్‌లోని ట్రాంక్విల్ వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా ప్రార్థన సమావేశం**


**ఆటలతో సంతోషంగా గడిపిన పాస్టర్ల కుటుంబ సభ్యులు**

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జన్మదిన వేడుకలు జరుపుకున్న పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్, బ్రదర్ అప్పారెడ్డిగూడెం భీమయ్య లు**

**బుద్వేల్, జూన్ 5 (ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ ప్రేయర్ వారియర్స్ ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న క్రైస్తవ సంఘాల పాస్టర్లు, వారి కుటుంబ సభ్యులు




తమ జన్మదినం సందర్భంగా కలసి కేక్ కట్ చేసిన పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్, బ్రదర్ అప్పారెడ్డిగూడెం భీమయ్య లు

రాజేంద్రనగర్ ప్రేయర్ వారియర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మొయినాబాద్ మండలం సురంగల్ లోని ట్రాంక్విల్ వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థన సమావేశాలు నిర్వహించారు. రాజేంద్రనగర్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సిహెచ్ సునీల్ సామ్యూల్ , ప్రేయర్ వారియర్స్ కో ఆర్డినేటర్స్ పాస్టర్ ప్రణీత్ బాబు, పాస్టర్ బట్టు శ్రీకాంత్, పాస్టర్ గుంటి డానియల్ ల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ కె సుందర్ పాల్ బైబిల్ సందేశాలను అందచేశారు. ప్రతి రోజు ప్రార్థించాలన్నారు. క్రైస్తవులకు ఆయుధం ప్రార్థన అని గుర్తు చేశారు. విసుకక ప్రార్థించే వారిగా ఉన్నప్పుడు యేసు ప్రభువు గొప్ప కార్యాలు చేస్తారన్నారు. అనంతరం పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ పి స్వర్ణ కుమార్ శుభాలు తెలియచేశారు. రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రేయర్ వారియర్స్ ప్రార్థనలు మూడు సంవత్సరాలుగా ఎంతో చక్కగా జరుగుతున్నాయన్నారు. ప్రేయర్ వారియర్స్ ద్వారా మేలు పొందిన పాస్టర్ పి యేసు రత్నం, పాస్టర్ యేసన్న, పాస్టర్ మోజెస్ బండారి, పాస్టర్ ప్రశాంత్ కుమార్ లు సాక్ష్యం చెప్పి దేవుణ్ణి మహిమ పరిచారు

**ఘనంగా పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్, బ్రదర్ అప్పారెడ్డిగూడెం భీమయ్య ల జన్మదిన వేడుకలు**

రాజేంద్రనగర్ ప్రేయర్ వారియర్స్ ప్రత్యేక ప్రార్థన సమావేశాల సందర్భంగా శుక్రవారం జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్, అప్పారెడ్డి గూడెం భీమయ్యలా చేత కేక్ కట్ చేయించి శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఇరువురి కుటుంబాల కోసం పాస్టర్లంతా ప్రార్థనలు చేశారు.

**ఆటలతో సంతోషంగా గడిపిన పాస్టర్ల కుటుంబ సభ్యులు :**

ప్రేయర్ వారియర్స్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థన కూడికల అనంతరం కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి, పాటల పోటీలలో ప్రతి ఒక్కరు పాల్గొని సంతోషంగా గడిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో మొయినాబాద్ మండలం పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ ఎం ఎం సామ్యూల్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు పాస్టర్ యేసు రత్నం, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్, ప్రేయర్ వారియర్స్ మాజీ కో ఆర్డినేటర్స్ రెవరెండ్ ఎన్ రాజారాం, రెవరెండ్ జేపీ పాల్, పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్షురాలు సిస్టర్ పి అనురాధ, ప్రధాన కార్యదర్శి సిస్టర్ ఎన్ స్వర్ణ రాజారాం, ఉపాధ్యక్షురాలు సిస్టర్ ఎస్ యేసు మణి, సిస్టర్ కె స్పందన పాల్, సిస్టర్ లీనా దేవదాస్, సిస్టర్ సుజాత రాంబాబు, సిస్టర్ సువార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ, నిబద్ధత కలిగిన నిస్వార్థ నాయకుడు స్వర్గీయ జి. ఎల్లన్న

**మాజీ మంత్రి హరీశ్ రావు**

**తెల్లాపూర్ 'జి. ఎల్లయ్య ఎన్‌క్లేవ్'లో ఎల్లన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన హరీశ్ రావు**

**పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి**

**ఎల్లన్న వర్ధంతి నాటికి 12 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం**





**పటాన్చెరు, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ జి. ఎల్లన్న 85వ జయంతి ఉత్సవాలు తెల్లాపూర్‌లోని జి. ఎల్లయ్య ఎన్‌క్లేవ్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై, ఎల్లన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సభలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, ఎల్లన్న కుమారుడు విజయ్ ప్రతాప్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు , మాట్లాడుతూ, ఎల్లన్న కేవలం ఒక కార్మిక నాయకుడిగానే కాకుండా, చివరి శ్వాస వరకు నిలిచిన గొప్ప తెలంగాణ ఉద్యమ యోధుడని కొనియాడారు. బీహెచ్‌ఈఎల్ ప్రాంతంలో ఎల్లన్న పేరు తెలియని వారు, ఆయన సేవలు అందుకోని వారు ఎవరూ లేరన్నారు. ఒక సాధారణ కార్మికుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, బీహెచ్‌ఈఎల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా , జాతీయ స్థాయి ఉపాధ్యక్షుడిగా ఎదిగి కార్మికుల మన్ననలు పొందారని గుర్తుచేశారు. ఆనాడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, బాగా రెడ్డి, మల్లికార్జున్ వంటి పెద్దల సహకారంతో పోరాడి కార్మికుల కోసం ఎంఐజీ-2 కాలనీని సాధించిన అపర భగీరథుడు ఎల్లన్న అని అన్నారు. ఉత్తర భారతదేశం నుండి వస్తున్న వారికోసం ఇక్కడి స్థానిక రిజర్వేషన్లు తొలగించినప్పుడు, నా ప్రాణం పోయినా సరే.. భూములు కోల్పోయిన తెలంగాణ బిడ్డలకే ఉద్యోగాలు దక్కాలి అని సీఐఎస్ఎఫ్ యాజమాన్యంతో నిలబడి కొట్లాడిన గొప్ప స్థానిక పక్షపాతి ఎల్లన్న అని హరీశ్ రావు అన్నారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలో డీసీఎం వ్యాన్ నుండి దూకి రెండు కాళ్లు విరిగినా, ఆసుపత్రి మంచంపై నుంచే 'జై తెలంగాణ' అని నినదించిన పోరాట పటిమ ఆయనదన్నారు. మలిదశ ఉద్యమంలో కేసీఆర్ గారు పిలుపునివ్వగానే అండగా నిలిచి గల్లీ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ వాణిని బలంగా వినిపించారని గుర్తుచేశారు. తన ఆరోగ్యం, కుటుంబం గురించి కాకుండా నిరంతరం కార్మికులు, తెలంగాణ రాష్ట్రం కోసమే ఆలోచించిన నిస్వార్థ నాయకుడు కాబట్టే, ఈరోజు పార్టీలకు అతీతంగా అందరూ ఆయనను గుండెల్లో పెట్టుకున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. తెల్లాపూర్‌లోని ఈ కాలనీ ఫైనల్ లేఅవుట్ సమస్య వచ్చినప్పుడు ఎల్లన్న, మహిపాల్ రెడ్డి, సోమిరెడ్డి తన వద్దకు వచ్చారని.. నాటి సీఎం కేసీఆర్ గారితో రాత్రి 10 గంటలకు ఫోన్ లో మాట్లాడి కేవలం గంట వ్యవధిలో ఆర్డర్స్ తెప్పించి 'జి. ఎల్లయ్య ఎన్‌క్లేవ్' ఏర్పాటుకు అండగా నిలిచామని తెలిపారు. ప్రస్తుతం ఆవిష్కరించిన విగ్రహం ఎల్లన్న స్థాయికి తగినట్లుగా లేదని అభిప్రాయపడిన హరీశ్ రావు.. ఆయన ధోతీ కట్టుకొని, పంచెకట్టుతో సగర్వంగా నిలబడేలా 12 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు. రాబోయే రెండు నెలల్లో రానున్న ఎల్లన్న గారి వర్ధంతి నాటికల్లా ఎల్ఐజీ సర్కిల్‌లో గానీ, తగిన స్థలంలో గానీ ఈ 12 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించే బాధ్యతను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి అప్పగిస్తున్నట్లు హరీశ్ రావు ప్రకటించారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా బీహెచ్‌ఈఎల్ ఉన్నంత కాలం ఎల్లన్న గారి పేరు కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని నివాళులర్పించారు. లేఅవుట్ సమస్య వచ్చినప్పుడు ఎల్లన్న, మహిపాల్ రెడ్డి, సోమిరెడ్డి తన వద్దకు వచ్చారని.. నాటి సీఎం కేసీఆర్ తో రాత్రి 10 గంటలకు ఫోన్ లో మాట్లాడి కేవలం గంట వ్యవధిలో ఆర్డర్స్ తెప్పించి 'జి. ఎల్లయ్య ఎన్‌క్లేవ్' ఏర్పాటుకు అండగా నిలిచామని తెలిపారు. ప్రస్తుతం ఆవిష్కరించిన విగ్రహం ఎల్లన్న స్థాయికిస తగినట్లుగా లేదని అభిప్రాయపడిన హరీశ్ రావు ఆయన ధోతీ కట్టుకొని, పంచెకట్టుతో సగర్వంగా నిలబడేలా 12 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు. రాబోయే పరెండు నెలల్లో రానున్న ఎల్లన్న వర్ధంతి నాటికల్లా ఎల్ఐజీ సర్కిల్‌లో గానీ, తగిన స్థలంలో గానీ ఈ 12 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించే బాధ్యతను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి అప్పగిస్తున్నట్లు హరీశ్ రావు ప్రకటించారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా బీహెచ్‌ఈఎల్స ఉన్నంత కాలం ఎల్లన్న పేరు కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని నివాళులర్పించారు.




## టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

**కూకట్ పల్లి, జూన్ (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సత్యం శ్రీరంగం పుట్టిన రోజును పురస్కరించుకొని కేపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో కేపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్ & స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేష్ శంకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్ష్యులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో శ్రావణి హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ శ్రీరంగం ఇందుమతి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ ముఖ్య అతిథిలుగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, కేకే కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వ సుజాత గుప్త మాట్లాడుతూ ప్రజాసేవలో సత్యం శ్రీరంగం మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాలానగర్ డివిజన్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్ గజానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల మహేష్ గౌడ్, సుంకన్న, ఇమ్ము, నరేష్ ఆధ్వర్యంలలో కేక్ లు కట్ చేసి, పండ్లు పంపిణి చేసి, స్వీట్లు పంచి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో విజయ దుర్గ సెంటర్ లో పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సీనియర్ మహిళా నాయకురాలు స్వరూప గౌడ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, డివిజన్ ల మహిళా అధ్యక్షురాళ్లు గుండ జ్యోతి, విజయ లక్ష్మి, మారుతీ, పొన్నం రజిత, జోజమ్మ, భారతమ్మ, ఏ ఎం సి డైరెక్టర్ ఫణి కుమార్, అరుణ్ గౌడ్, సృంజిత్ గౌడ్, కనకయ్య ముదిరాజ్, పవన్ గాండ్ల, ఆదిత్య, సంధ్య, ప్రణతి, అరవింద, నరేష్, వెంకటేష్, యుగేందర్, సాగర్, శ్రీశైలం, శంకర్, ఖలీమ్, విశాల్, నవీన్, ప్రశాంత్, లడ్డు, సాయి, పద్మ, శ్వేతా, జల్ల శివ, ప్రభాకర్, మల్లేష్, అమీర్, పాల్, రమేష్ గుప్త, శ్రీకాంత్, కనకరాజు యాదవ్, అరవింద్ గౌడ్, వెంకీ, శ్రీనివాస్, ఖేరా సింగ్, జ్యోతి, శ్రీను, కలికోట మహేష్, గోవింద్, పవన్, పారిశుద్ధ కార్మికులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ సోదరులు, తదిరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## వేములవాడ మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రానికి విరాళం

**రూ.1.50 లక్షలు అందజేసిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్**

**సామాజిక సేవకు మరో నిదర్శనం -- భక్తి, సేవా భావంతో ముందుకొచ్చిన తూము శ్రావణ్ కుమార్**

**కూకట్ పల్లి, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం కోసం మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఉదారంగా రూ.1,50,000/- విరాళం అందజేశారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, సమాజ సేవ పట్ల తన నిబద్ధతను చాటుకుంటున్న తూము శ్రావణ్ కుమార్ ఈ విరాళాన్ని అందజేయడం పట్ల మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణం పూర్తయిన అనంతరం వేలాది మంది భక్తులకు ఉచిత భోజన సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు సాయిని శ్రీనివాస్, సత్రం మేనేజర్ కర్రు తిరుపతి, సంఘ నాయకుడు కచ్చకాయల దేవరాజ్, తూము శ్రావణ్ కుమార్ నివాసానికి వెళ్లి విరాళ నగదును స్వీకరించారు. అనంతరం శ్రావణ్ కుమార్ ని, వారి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. సమాజ హితం, ఆధ్యాత్మిక సేవ, దాతృత్వం కలగలిపిన ఈ విరాళం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని సంఘం నాయకులు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మితమవుతున్న నిత్యాన్నదాన సత్రానికి సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు తమ వంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ "వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుగ్రహం తూము శ్రావణ్ కుమార్, వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం" అని తెలిపారు. భక్తి -- సేవ -- దాతృత్వానికి ప్రతీకగా నిలిచిన తూము శ్రావణ్ కుమార్ కి మున్నూరు కాపు సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది.



## అనుమతులు లేని నిర్మాణం కూల్చివేసిన హెచ్ఎండిఏ అధికారులు

**పటాన్ చెరు, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

బొల్లారం డివిజన్ పరిధిలో స్టేడియానికి కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేని నిర్మాణాలను హెచ్ఎండిఏ అధికారులు కూల్చివేశారు . స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని హుడా సంస్థ పర్యవేక్షకులు సోహెల్ అహ్మద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేతలు చేశారు. బొల్లారం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కిష్ట రెడ్డి, హుడా పోలీస్ సిబ్బంది ఈ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా హుడా అధికారి సోహెల్ అహ్మద్ మాట్లాడుతూ హుడా స్థలాల్లో ఎటువంటి అక్రమ నిర్మాణాలు జరిపిన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## పార్టీ వాడ బస్తీలో అభివృద్ధికి కొత్త రూపం... రూ.45 లక్షలతో ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణం

**యువత కోసం ఆధునిక జిమ్ -- పేద ప్రజల శుభకార్యాలకు కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి**

**మొదటి అంతస్తు పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

**కూకట్ పల్లి, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతే నగర్ డివిజన్ పరిధిలోని పార్దివాడ (పిట్టల బస్తీ) అభివృద్ధిలో మరో కీలక అడుగు పడుతోంది. స్థానిక ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.45 లక్షల నిధులతో నిర్మిస్తున్న కమ్మ కమ్యూనిటీ హాల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు పనులను మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత వారికి పలు సూచనలు చేశారు. భవనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో నిర్మించాలని ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ పార్థివాడ (పిట్టల బస్తీ) యువత ఎంతో కాలంగా జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, వారి అభ్యర్థన మేరకు కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆధునిక పరికరాలతో కూడిన జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా జిమ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును స్థానిక ప్రజలు తమ వివాహాలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి రావడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం ద్వారా పిట్టల బస్తీ ప్రజలకు ఒకే భవనంలో సామాజిక అవసరాలు, యువత కోసం ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, బస్వరాజ్, బబ్లూ, శోభన్ బాబు, చమన్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుంది

**బిజెపి నాయకులు కుమార్ యాదవ్**

**కూకట్ పల్లి, జూన్ 5 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ జలకన్య పార్క్ దగ్గర బిజెపి యువ నాయకులు శైలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, బట్ట సంచులను ఉపయోగించడం, వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటడం, నీటిని, విద్యుత్తును ఆదా చేయడం వంటి వాటిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఎవరిదో బాధ్యత అనే భ్రమలో జీవిస్తూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాం అన్నారు. దీనివలన ఉష్ణోగ్రతలలో మార్పులు సంభవిస్తూ అకాల వర్షాలు, తీవ్రతరమైన ఎండలు, కలుషితం అవుతున్న నేల, నీరు గాలి వల్ల మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల చుట్టూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కేశవరావు, దుర్గ ప్రసాద్, మని భూషణ్, కమలాకర్ రెడ్డి, కుమార్ చారి, రఘు, రమేష్, సంతోష్, నరసింహ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్ 8వ బెటాలియన్ లో మొక్కలు నాటుతున్న కామాండెంట్ ఇతర అధికారులు

## కొండాపూర్ 8వ బెటాలియన్‌లో ఘనంగా 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'

**జోయాలుకాస్ భాగస్వామ్యంతో భారీగా మొక్కల పెంపకం!**

**శేరిలింగంపల్లి : జూన్ 5,(ప్రభాత ఉదయం)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ లోని 8వ బెటాలియన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ జ్యువలరీ సంస్థ జోయాలుకాస్ సహకారంతో నిర్వహించిన ఈ హరిత మహోత్సవానికి బెటాలియన్ సిబ్బంది, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. కమాండెంట్ ఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడానికి కాలుష్య రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణానికి మొక్కలే ప్రాణాధారం. కేవలం మొక్కలు నాటడమే కాదు, వాటిని రక్షించి, పెద్దవి చేసేంత వరకు బాధ్యతగా చూసుకోవాల్సిన కర్తవ్యం మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో అధికారులతో పాటు సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని బెటాలియన్ ఆవరణలో మొక్కలను నాటారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు వి. అనిల్ కుమార్, డి. నరేందర్ రెడ్డి, డి. సత్యనారాయణ, ఎస్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు. జోయాలుకాస్ సంస్థ ప్రతినిధులు బెటాలియన్ ఇతర ఉన్నతాధికారులు సిబ్బంది ఈ హరిత కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు.

# వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల సృజనాత్మక దోహదపడతాయి







### అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్

### ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ సమ్మర్ క్యాంప్ చిన్నారుల సైన్స్ సెంటర్ సందర్శన

**హైదరాబాద్, జూన్ 5(ప్రభాత ఉదయం)**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న అకాడమీ సిబ్బంది, క్వార్టర్స్‌లో నివసిస్తున్న చిన్నారులు, తమ విజ్ఞానాన్ని విస్తరించుకునే ఉద్దేశంతో చిక్కడపల్లిలోని సర్ సివి రామన్ అక్షయ విద్య సైన్స్ సెంటర్ ను సందర్శించారు.అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ విద్యా పర్యటనలో 53 మంది చిన్నారులు వివిధ శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలు , ప్రత్యక్ష ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ అనుభవాత్మక అధ్యయనం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం, సృజనాత్మకత, పరిశోధనా ఆసక్తి , ప్రాథమిక శాస్త్రీయ సూత్రాలపై ఆచరణాత్మక అవగాహన పెంపొందింది.గత నెల రోజులుగా సమ్మర్ క్యాంప్ ఇన్‌చార్జి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం. కృష్ణ ఆధ్వర్యంలో అకాడమీలో వివిధ విద్యా, క్రీడా, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. వాటిలో భాగంగా చిన్నారుల విజ్ఞానాన్ని మరింత విస్తరించేందుకు ఈ సైన్స్ సెంటర్ సందర్శన ఏర్పాటు చేయబడింది.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో డిప్యూటీ డైరెక్టర్ (వెల్ఫేర్) డి మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ (అవుట్‌డోర్) శ్రీరామమూర్తి తమ సహకారాన్ని అందించారు. ఆర్ఐ కృష్ణతో పాటు అకాడమీ సిబ్బంది చిన్నారులను సైన్స్ సెంటర్‌కు తీసుకువెళ్లి అక్కడి ప్రదర్శనలను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అనుభవాత్మక విద్యను క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం మరియు విలువల ఆధారిత శిక్షణతో సమన్వయం చేస్తూ పిల్లల సమగ్రాభివృద్ధికి ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. భవిష్యత్తులో కూడా యువ మేధస్సులను ప్రోత్సహిస్తూ, పిల్లల్లో శాస్త్రీయ చైతన్యం, సృజనాత్మకత మరియు నవ్య ఆలోచనలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు అకాడమీ అధికారులు తెలిపారు.

# ఏడేళ్ల చిన్నారిపై తండ్రీకొడుకుల అత్యాచారం.. జీవితఖైదు విధించిన కోర్టు!

**శేరిలింగంపల్లి : జూన్ 5, (ప్రభాత ఉదయం)**

సమాజం తలదించుకునేలా కన్నకూతురు వయసున్న ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి ఒడిగట్టిన తండ్రీ కొడుకులకు కోర్టులో ఊరట లభించలేదు. నమ్మిన పొరుగువారే నరరూప రాక్షసులుగా మారి చేసిన ఈ ఘోరానికి గాను నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది.

**కడుపు కోత మిగిల్చిన ఘటన..**

పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన శివకుమార్ (45), అతని కుమారుడు శామ్యూల్ అలియాస్ శామిల్ (21) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కొంపల్లిలో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కాగా 2023 ఆగస్టు 10న స్థానికంగా ఉండే ఓ కూలీ దంపతులు తమ ఇద్దరు చిన్న పిల్లలను ఇంట్లోనే వదిలి పనికి వెళ్లారు. అదే రోజు ఉదయం 9 గంటల సమయంలో ఒంటరిగా ఉన్న ఏడేళ్ల బాలికను నిందితులు తండ్రి శివకుమార్, శామ్యూల్ ఆశ చూపి వారి గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ ఆ చిన్నారిపై తండ్రీ కొడుకులిద్దరూ పైశాచికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. రాత్రి 11 గంటల సమయంలో తల్లిదండ్రులు పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి బాలిక తీవ్ర రక్తస్రావంతో ఏడుస్తూ కనిపించింది. కన్నతల్లి ప్రేమతో ఆరా తీయగా పక్కింట్లో ఉండే





అత్యాచారం చేసిన తండ్రి కొడుకుల ఫోటోలు..

శివకుమార్, అతని కొడుకు తనను తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆ చిన్నారి రోదిస్తూ చెప్పింది. దీనిపై నిందితులను నిలదీయగా.. వారు అక్కడి నుంచి పరారయ్యారు.

**వేగంగా స్పందించిన పోలీసులు**

బాధిత తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదైంది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు ఘటన జరిగిన రెండు రోజులకే ఆగస్టు 12 నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**న్యాయస్థానం సంచలన తీర్పు**

ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ జరిపిన మేడ్చల్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. వెంకటేష్ నిందితులపై నేరం రుజువు కావడంతో కఠిన తీర్పును వెలువరించారు.నిందితుడు శివకుమార్,శామ్యూల్ లకు జీవిత ఖైదు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరికీ చెరో రూ.10,000 జరిమానా విధించారు. బాధితురాలి భవిష్యత్తు, మానసిక క్షోభను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వ పరంగా ఐదు లక్షల రూపాయల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది. సమాజంలో చిన్న పిల్లలపై జరిగే ఇటువంటి ఘోరమైన నేరాలలో నిందితులకు కఠిన శిక్ష పడేలా పోలీసులు పకడ్బందీగా దర్యాప్తు చేశారు. వేగంగా దర్యాప్తు చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చూసిన పోలీసు అధికారులను న్యాయ స్థానం అభినందించింది.

# గండిపేట భూ'కాటు'.. కింగ్‌పిన్ బ్రహ్మానాయుడు అరెస్ట్!

### నకిలీ జీవోలతో రూ. వందల కోట్ల సర్కారు భూమికి ఎసరు..

### రూ. 12 కోట్ల చేతులు మారిన వైనం.. కాంచీపురంలో పట్టుకున్న పోలీసులు

**శేరిలింగంపల్లి : జూన్ 5, (ప్రభాత ఉదయం)**

గండిపేట మండలంలోని వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో నొక్కేయాలని చూసిన భారీ కుట్ర కేసులో ఎట్టకేలకు 'బిగ్ ఫిష్' చిక్కింది. నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డుల సృష్టి వెనుక సూత్రధారి, ఈ కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడిని నార్సింగి పోలీసులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ బృందం సంయుక్తంగా కాంచీపురంలో వేటాడి పట్టుకున్నారు. హైకోర్టు సైతం ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో తమిళనాడుకు పారిపోయిన ఇతగాడిని చాకచక్యంగా అరెస్ట్ చేసి నగరానికి తరలించారు.



నకిలీ పాత్రలతో ప్రభుత్వం భూమిని కాజేయాలనే ప్రయత్నించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు..

**12 కోట్ల 'మాయా'జాలం!**

ఈ కేవలం ఒక సాధారణ భూమి వివాదం కాదు.. అక్షరాలా రూ. 12 కోట్ల మేర నల్లధనం చేతులు మారిన హైప్రొఫైల్ స్కామ్ గండిపేట మండలం సర్వే నెం.18లోని సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయించుకునేందుకు బొల్లా బ్రహ్మానాయుడు పెద్ద ప్లానే వేశాడు. ఇప్పటికే అరెస్టయిన రాధాకృష్ణకు రూ. 4 కోట్లు తప్పుడు పత్రాల సృష్టికి సహకరించిన ఇతర మధ్యవర్తులకు మరో రూ. 4 కోట్లు ఎరగా వేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రభుత్వ అధికారుల సంతకాలను, ముద్రలను ఫోర్జరీ చేసి ఏకంగా నకిలీ జీవోలనే పుట్టించి ఈ కోట్ల విలువైన భూమిపై హక్కులు పొందేందుకు నిందితులు తెగబడ్డారు. కేసు తీవ్రతను ముందే ఊహించిన బ్రహ్మానాయుడు అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశాడు. అయితే గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు సేకరించిన పక్కా ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన గౌరవ హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించింది. దాంతో పరారైన నిందితుడిని తమిళనాడులోని కాంచీపురం పరిసరాల్లో పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా తిరుగుతుండడంతో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు.

**కటకటాల్లోకి ముఠా..**

ఈ అంతర్రాష్ట్ర భూ కబ్జా కుట్ర కేసులో పోలీసులు ఇప్పటికే నిమ్మల కుటుంబ సభ్యులతో పాటు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రభీన్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం కోర్టు అనుమతితో వీరంతా పోలీస్ కస్టడీలోనే విచారణ ఎదుర్కొంటున్నారు. తాజాగా ప్రధాన నిందితుడు బ్రహ్మానాయుడు దొరకడంతో ఈ కుట్ర వెనుక ఉన్న అసలు రంగులు మరిన్ని బయటపడే అవకాశం ఉంది. ప్రభుత్వ అధికారుల పేర్లు, సంతకాలు దుర్వినియోగం కావడం వందల కోట్ల విలువైన ల్యాండ్ స్కామ్ కావడంతో ఈ కేసులో ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో నార్సింగి, ఈవోడబ్ల్యూ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టయిన బ్రహ్మానాయుడిని నేడు న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నాట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.





అరుణోదయ కాలనీ మొక్కలు నాటుతున్న విశ్రాంత ఉద్యోగులు..

# మాదాపూర్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### అరుణోదయ కాలనీలో మొక్కలు నాటిన ప్రముఖులు

**శేరిలింగంపల్లి : జూన్ 5, (ప్రభాత ఉదయం)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని అరుణోదయ కాలనీ పార్క్-2 లో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఐటీ నిపుణుల (సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్) సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పచ్చదనాన్ని కాపాడుకుంటూ భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది.

**పచ్చదనం - పరిశుభ్రత మన బాధ్యత**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాలనీ ప్రెసిడెంట్ కె. కోటేశ్వరరావు, సెక్రటరీ ఎం. శ్రీహరి హాజరై, కాలనీ పార్కులో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాల విస్తరణలో భాగంగా కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న తరుణంలో ఇలాంటి కాలనీ పార్కులను పచ్చదనంతో నింపుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కనీసం ఒక మొక్కనైనా నాటి దాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చారు. తరలివచ్చిన రిటైర్డ్ ఉన్నతాధికారులు, ఐటీ నిపుణులు

ఈ హరితోత్సవంలో పలువురు విశ్రాంత ఉన్నతాధికారులు, ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ఐజీ ఎం. శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్ట్ మాజీ జీఎం. పి. వసంత్ మాజీ సీఎంసీ వైస్ ప్రెసిడెంట్ ప్రభు, మాజీ సివిల్ సప్లై జీఎం ఆర్. ఎస్ ప్రభు, ప్రముఖ పారిశ్రామికవేత్త కేఎస్. నంది తదితరులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కాలనీ అసోసియేషన్లు చొరవ చూపడం అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. మాదాపూర్ లాంటి బిజీ ఐటీ కారిడార్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ నిపుణులు సైతం తమ వారాంతపు బిజీ షెడ్యూల్‌ను పక్కన పెట్టి ఉదయాన్నే ఈ పర్యావరణ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. కాలనీని ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి ఐటీ ప్రొఫెషనల్స్, కాలనీ కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి

**హైదరాబాద్, : జూన్ 5, (ప్రభాత ఉదయం)**




కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.